క్లుప్తంగా

దేవస్థానానికి అన్నదాన ట్రస్టు నిధుల అందజేత



దేవస్థానానికి ట్రస్టు సొమ్ము సంబంధిత పత్రాలను అందజేస్తున్న వేగేశ్న రంగరాజు

భీమవరం (ప్రకాశం చౌక్): అన్నపూర్ణ పార్వతి సమేత శ్రీ సోమేశ్వర లక్ష్మీ జనార్దన స్వామి వార్ల అన్నదాన చారిటబుల్ ట్రస్టులోని నిధులను ఆదివారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆధ్వర్యంలో పంచారామ క్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి దేవస్థానానికి అందజేశారు. గతంలో ట్రస్ట్ ద్వారా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు. ఈ క్రమంలో దాతలు ఇచ్చిన విరాళాల సొమ్ములు రూ.49,82,825.53లను సోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానానికి ట్రస్టు చైర్మన్ చైర్మన్ వేగేశ్న రంగరాజు అప్పగించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు హాజరయ్యారు.

నేటి నుంచి కేవీపీఎస్ శిక్షణా తరగతులు

భీమవరం: కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి చైతన్య శిక్షణా తరగతులు సోమవారం నుంచి మూడు రోజులపాటు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో దళితులు, వెనకబడిన తరగతుల అభివృద్ధి కోసం కేవీపీఎస్ నిరంతరం పోరాడుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ దళిత పేటల అభివృద్ధికై కృషి చేస్తోందన్నారు. శిక్షణా తరగతులు పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ సి.నాగరాణి, ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు, జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి హాజరుకానున్నారని తెలిపారు. ఈ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 200 మంది ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నారన్నారు. శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్లలో వేంచేసియున్న గంగాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందిన ఈ అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. భక్తులు మొక్కుబడిని చెల్లించుకొని అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

చేనేత వస్త్రాలకు ఆదరణ పెరగాలి



జాన నాగేశ్వరరావు కాంస్య విగ్రహావిష్కరణ చేసిన మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: చేనేత కార్మికుడు జాన నాగేశ్వరరావు బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక లాకు సెంటర్‌లో బహుజన కులాల ఆత్మ గౌరవ పోరాట యోధుడు, చేనేత కార్మికుడు జాన నాగేశ్వరరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ చేతి వృత్తుల ప్రాధాన్యం పెరగాలని, వారికి తగిన చేయూత నివ్వాలని పేర్కొన్నారు. అలాగే చేనేత వస్త్రాలకు ఆదరణ పెరగాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తామని, జీఎస్టీ తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అంగర రామ్మోహన్, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరునాయుడు, వీవర్స్ సంఘ సభ్యులు వట్టం గణేశ్వరరావు, మానెం బసవరాజు, శాగా రాంబాబు, బాసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

వెండి పళ్లెం బహూకరణ

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు విశాఖపట్నానికి చెందిన వంకాయల విక్రమ్, రోజా దంపతుల కుమారుడు నివాస్, కుమార్తె సుప్రజ కుటుంబ సభ్యులు వెండి పళ్లేన్ని బహూకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో రూ.38 వేలు విలువ గల వెండి కంచాన్ని అందించారని తెలిపారు. ఆలయాభివృదికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి సరే.. సొమ్ములేవీ?



గొరగనమూడిలో ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు



మొగల్లులో ఉపాధి పనికి వచ్చిన కూలీలు

- ఉపాధి హామీ పథకంలో భరోసా కరువు
- 8 వారాలుగా కూలీలకు అందని వేతనాలు
- ఉండి నియోజకవర్గంలో 29,696 మందికి జాబ్ కార్డులు
- ఆర్థిక సమస్యలతో కుటుంబాలు సతమతం

పాలకోడేరు: గ్రామాల్లో వలసలను నివారించడానికి కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జాబ్ కార్డులు అందజేసి కూలీలకు స్థానికంగా పనులు చూపించి ఉపాధి కల్పిస్తున్నారు. రోజుకు రూ.300 కూలీ గిట్టుబాటు అయ్యేలా పనులు చేయిస్తున్నారు. అయితే ఉండి నియోజకవర్గంలో ఈ పథకంలో భాగంగా కూలీలకు పనులు కల్పిస్తున్నా గత ఎనిమిది నెలలుగా సొమ్ములు చెల్లించకపోవడంతో కూలీల కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నెలల తరబడి కూలీ సొమ్ములు ఇవ్వకపోవడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలంటే ఆవేదన చెందుతున్నారు.

చెల్లించాల్సిన బకాయి రూ.39,91,798

ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు, ఉండి మండలాల్లో మొత్తం 29,696 మందికి ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయి. ఈ ఏడాది 23,188 కుటుంబాలకు 12 వారాల పాటు పని కల్పించారు. 25,245 మంది కూలీలు పని చేశారు. ఇందులో నాలుగు వారాలకు మాత్రమే ఉపాధి బిల్లులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మే 16 నుంచి ఇప్పటివరకు కూలీలకు చేసిన పనులకు సొమ్ము అందలేదు. 8 వారాల ఉపాధి కూలీల బిల్లులు రూ.39 లక్షల 91,వేల 798 సొమ్ము కూలీలకు చెల్లించాల్సి ఉంది. మండుటెండల్లో కష్టపడి పనిచేసినా బిల్లులు రాకపోవడంతో తాము ఎలా బతకాలంటూ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రతి వారానికి ఉపాధి కూలీల బిల్లులు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యేవని కూలీలు చెబుతున్నారు. ఈ ఏడాది ఉపాధి హామీ కూలీలు చేసిన పనిదినాలకు ఇంకా బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జయబాబును వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, బిల్లులు మంజూరయ్యాయని, రెండు మూడు రోజుల్లో కూలీలకు సొమ్ములు చెల్లిస్తామని చెప్పారు.

ఉండి నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం వివరాలు

మండలం	జాబ్ కార్డులు	కుటుంబాలు	కూలీలు	బకాయిలు
పాలకోడేరు	8,073	5,899	8,753	9,59,427
ఆకివీడు	5,870	4,444	6,955	10,93,524
కాళ్ళ	7,067	5,677	8,380	93,2628
ఉండి	9,686	7,168	11,157	10,06219
మొత్తం	30,696	23,188	35,245	39,91798

ఏడు వారాల సొమ్ములివ్వాలి



ప్రతి ఏడాది ఉపాధి పనికి వెళుతున్నాను. ఈ పథకం వల్ల మా కుటుంబ పోషణ గడుస్తుంది. పనిచేసిన 7 వారాలకు సంబంధించి కూలి డబ్బులు పడకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం.

– దాసరి మణికుమారి, ఉపాధి కూలీ, మొగల్లు

చేసిన పనికి డబ్బులివ్వకపోతే ఎలా ?



కుటుంబాన్ని పోషించుకుందామని ఉపాధి పనికి వెళ్లాను. తీరా పని చేశాక ఎన్ని వారాలు గడిచినా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ కాలేదు. మేట్‌ని అడుగుతుంటే ఇదిగో అదిగో అంటున్నారు ఇలా అయితే ఎలా?

– పెనుమాల మరియమ్మ, ఉపాధి కూలీ, మొగల్లు

గత ప్రభుత్వంలోనే నయం



ఉపాధి హామీ పథకంలో ఏడు వారాలకు పైగా పని చేశాను. ఇప్పటివరకు కూలి డబ్బులు అందలేదు. గత ప్రభుత్వంలో ఎప్పుడు ఇలా జరగలేదు. ఇప్పుడే ఇంత ఆలస్యమైంది ఎందుకో తెలియదు. ఇప్పటికైనా డబ్బులిప్పించాలి.

– డి.మార్త, ఉపాధి కూలి, మొగల్లు

ఈ–పంట నమోదు వేగవంతం చేయండి



పెదఅమిరంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

కాళ్ల: ఖరీఫ్ ఈ–పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబందిత అధికారులను ఆదేశించారు. పెదఅమిరం పుంతరోడ్డులో ఈ–పంట నమోదు తీరును ఆదివారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులు సాగు చేస్తున్న పంట వివరాలు నమోదుతోనే పంట సాయం, పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు వీలవుతుందన్నారు. ఇందుకు ఈ–పంట నమోదు తప్పనిసరి అన్నారు. పంట నమోదులో ఆలసత్వం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. రెతులు ఏ పంటను సాగుచేస్తే ఆ పంట వివరాలనే నమోదు చేయాలన్నారు. మరో పంట సాగు చేసినట్లు నమోదు చేస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. కౌలుదారు అనే విషయాన్ని స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువులు కౌలు రైతులతో మాట్లాడి వరి పంట సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కేఎస్ఎస్ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఈ.నాగార్జున, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వ్యవసాయ, రెవెన్యూశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వీవీ గిరి' కళాశాల అభివృద్ధికి సమష్టిగా కృషి



కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న గొంట్లా కృష్ణ

ఆకివీడు: విద్యాదాత స్వర్గీయ చింతలపాటి మూర్తిరాజు ఆశయ సాధనలో వెలసిన వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు గొంట్లా కృష్ణ పిలుపునిచ్చారు. దుంపగడపలోని కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దాతల సహకారంతో కళాశాల ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రిన్సిపాల్ కె.సుజాత మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో నాక్ బృందం కళాశాలను సందర్శించనుందన్నారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థులతో నాక్ బృందం సమావేశం కానుందన్నారు. కళాశాలలో మౌలిక వసతులు, ఉత్తమ విద్యాబోధన, ల్యాబ్ తదితర సౌకర్యాలను గతం కంటే ఎంతో మెరుగుపడిన విషయాన్ని నాక్ బృందం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. నాక్ బృందం పరిశీలనలో కళాశాలకు ఏ++ గ్రేడ్ వచ్చేలా కృషి, సహకారం అవసరమన్నారు. పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు చొప్పెర్ల మూర్తి, దాసరి వెంకట సత్యనారాయణ, మోహనరావు, పూర్వపు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

పాలకొల్లు సెంట్రల్: ప్రత్యేక హోదా సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. ఆదివారం పట్టణ మహిళా సంఘ భవనంలో జిల్లా సీపీఎం కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా కాపాడుకోవలసిన భాధ్యత రాష్ట్రానిదేనన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు ధాన్యం సొమ్ములు ఇంకా రాలేదని వెంటనే రైతులకు సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు ఖరీఫ్ పంటకు పెట్టుబడులు లేక ఎదురు చూస్తున్నారన్నారు. బబకాయిలు వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు. కౌరు పెద్దిరాజు, పీవీ ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, జేఎన్వీ గోపాలం పాల్గొన్నారు.

ఘనంగా మావుళ్లమ్మ జాతర



మావుళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని 37వ వార్డులో శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, అఘోరాల నృత్యాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మన పూర్వీకులు గ్రామ శాంతి కోసం పండుగలు, జాతరలు, ఉత్సవాలు ఏర్పాటు చేశారని, ఆధునిక యుగంలో ఈ ఆచారాన్ని కొనసాగించడం వల్ల ఎన్నో విపత్తుల నుంచి బయటపడుతున్నామని, ఈ సంస్కృతిని రాబోయే తరం వారికి తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెన్ను శాంతి, చెన్ను చంటి, ఎ.కుమరన్, మీనాంబిక, జూలూరి పండు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల ప్రక్షాళనతో ఆరోగ్యంగా గ్రామాలు



కలవపూడిలో పనులను ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు

కాళ్ల: ఎక్కడ సక్రమంగా మురుగునీరు పారుతుందో అక్కడ ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం కలవపూడి గ్రామంలోని మామిడిపూడిరోడ్డు వద్ద మురుగుకాలువలో పూడిక తొలగింపు పనులను స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుతో కలిసి కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు రైతుల భాగస్వామ్యంతో మురుగు కాలువలు శుభ్రం చేసేందుకు సంకల్పించడం, దీనికి గ్రామంలోని రైతులు రూ.13 లక్షలు ఇచ్చి సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. డ్రెయిన్ల ప్రక్షాళన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని చాలా డ్రెయిన్లలో గుర్రపుడెక్క, కిక్కిస, తూడు తొలగింపు పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వం, రైతుల సహకారంతో మూడు నెలల్లో నియోజకవర్గంలోని డ్రెయిన్ల ప్రక్షాళన పూర్తి చేస్తామన్నారు. తొలుత హైస్కూల్ ఆవరణలో కలెక్టర్, ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ప్రాతళ్లమెరకలో మంచినీటి చెరువును పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు, సర్పంచ్ గేదెల జాన్ పాల్గొన్నారు.

నేడు వన మల్లికార్జునుడికి జలాభిషేకం

మొగల్తూరు: మొగల్తూరులో శ్రీ భ్రమరాంబ సమేత వన మల్లికార్జునస్వామికి శ్రావణ మాసంలో వచ్చే 5 సోమవారాలు జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్తరాది తరహాలో కావిడి యాత్రల మాదిరిగా మన ప్రాంతంలోని వన మల్లికార్జున స్వామికి కావడిలతో నీటిని తీసుకొచ్చి జలాభిషకం నిర్వహిస్తామన్నారు. శ్రీ శైలం తర్వాత స్వామివారి లింగాన్ని తాకి సాష్టాంగ నమస్కారంచేసే అవకాశం ఉందని, భక్తులు తరలిరావాలని కోరారు.


వాయు త్రిలింగ క్షేత్రంలో పూజలు

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో ఆదివారం శ్రావణ మాసం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పార్వతీ దేవికి కుంకుమ పూజలు చేశారు. నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ఆలయ అర్చకస్వామి ర్యాలి శివాజీ, ఈవో నామాల రంగరాజన్ కమిషనర్ దంపతులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

పసర్ల బారిన మంచినీటి చెరువు నీరు



గూట్లపాడులో రక్షిత మంచినీటి చెరువు



తాగునీరు పసర్లు బారిన దృశ్యం

భీమవరం అర్బన్: గూట్లపాడులో రక్షిత మంచినీటి చెరువులో తాగునీరు పసర్లబారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది కుళాయి ద్వారా సరఫరా చేసే తాగునీరు మురికిగా, పసర్లుగా ఉండటంతో తరచూ జలుబు, జ్వరం తదితర వైరల్ జ్వరాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల కొత్తనీరు చెరువులో చేరడంతో తాగునీరు కలుషితమైందని వాపోతున్నారు. దీంతో ఆర్థిక స్థోమత కలిగినవారు మినరల్ వాటర్ కొనుక్కుని తాగుతున్నారని, స్తోమత లేని పలువురు ఇదే నీటిని వ్యాధులు బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

300 మందికి ఉచిత వైద్య సేవలు



శిబిరంలో ఓ రోగిని పరీక్ష చేస్తున్న వైద్యులు

యలమంచిలి: కుల, మతాలకు అతీతంగా పేదలందరికీ సహాయం చేయాలన్నదే యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సరీ్వస్ క్లబ్ (యూకేఎస్‌సీ) లక్ష్యాలలో ఒక అంశమని యూకేఎస్‌సీ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ చెప్పారు. యూకేఎస్‌సీ ఆధ్వర్యంలో ఆదివారం దొడ్డిపట్ల హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో క్లబ్ స్థాపించిన నాటి నుంచి ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, అనారోగ్యానికి గురైన పేదలకు వైద్యానికి అవసరమైన ఆర్థిక సహాయం, పర్యావరణ రక్షణకు మొక్కలు నాటడం, కైలాసరథం, వివిధ గ్రామా ల్లోని ప్రధాన కూడళ్లలో సిమెంట్ బల్లలు ఏర్పాటు వంటి పనులు చేపట్టామన్నారు. సేవల విస్తరణలో భాగంగా మారుమూల గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ సంజయ్ చెప్పారు. ఈ శిబిరంలో కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధులకు డాక్టర్ యాతం లక్ష్మీ శ్రీరంగ, చర్మ సంబంధిత వ్యాధులకు డాక్టర్ జక్కంపూడి సుభాషిణి, క్యాన్సర్ నిర్ధారణ వ్యాధులకు డాక్టర్ కుసుమ ప్రశాంతి, దంత సంబంధిత వ్యాధులకు డాక్టర్ కావలి మౌని జనరల్ వ్యాధులకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కౌశికి శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

15న వాండ్రంలో సువార్త సభ

ఉండి: వాండ్రం సెయింట్‌జాన్స్ లూథరన్ దేవాలయంలో ఈ నెల 15న ఉజ్జీవ సువార్త సభ నిర్వహిస్తున్నట్లు చర్చి ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ సభను ఉండి ఎన్నార్పీ అగ్రహారం పేరిష్ పాస్టర్లు రైట్ రెవరెండ్ డీ మేషక్ సతీష్‌కుమార్, రెవరెండ్ ఎన్ఏజీ అబ్షాలోమ్ ప్రారంభిస్తారన్నారు. సిస్టర్ వల్లభనేని రాజకుమారి (నిడదవోలు) వాక్యోపదేశం చేస్తారని సంఘ సీఆర్ పాలపర్తి కెప్టెన్‌రాజు తెలిపారు. పేరిష్‌లోని అన్ని సంఘాల క్రైస్తవ విశ్వాసులు, ఆసక్తి గలవారంతా ఈ సభలో పాల్గొనాలని వారు కోరారు.

రంగరాజుకు సత్కారం

ఉండి: నాటకరంగంపై పరిశోధనలతో డాక్టరేట్ సాధించిన గాదిరాజు రంగరాజును ఆదివారం పలువురు సత్కరించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, ఉండిలోను పలువురు ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మానవతా జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్ మోహన్‌రావు, ఆత్మీయ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల జానకీరామరాజు, ఎస్‌బీఐ ఉండి శాఖ మాజీ మేనేజర్ ఇందుకూరి గజపతిరాజు తదితరులు మాట్లాడుతూ కళాకారుడైన రంగరాజు నాటకరంగంపై డాక్టరేట్ సాధించడం అభినందనీయమని అన్నారు. మానవతా సేవసంస్థ సభ్యుడిగా డాక్టరేట్ సాధించడంపై సంస్థ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సంఘ సేవకులు పాల్గొన్నారు.

వీఐటీలో ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్, విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ వారి వీఐటీ ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే ఆదివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మంగం వేణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 2020–24 బ్యాచ్‌కి చెందిన సుమారు 800 మంది డిగ్రీ పట్టభద్రులకు సర్టిఫికెట్లు, బ్యాచ్ టాపర్‌కు బీవీ రాజు స్మారక పతకం, 26 మంది అకడమిక్ టాపర్లకు పతకాలు ప్రదానం చేశారు. శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సమ్, డైరెక్టర్లు డాక్టర్ పి.శ్రీనివాసరాజు, ప్రసాద్‌రాజు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

నరసాపురం: సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తోన్నట్లు నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్ చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని తెలిపారు.

దాతల సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగుల కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాత మల్లిన అరుణసారథి 15 ఫ్యాన్‌లు అందజేయడం అభినందనీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. క్లబ్ అధ్యక్షుడు మస్తాన్‌రావు అధ్యక్షతన డాక్టర్ అరుణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు సద్వినియోగపడుతున్నాయని స్పష్టం చేశారు. సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, కె.సిద్ధార్థ, అక్కిన కాశీ విశ్వనాథం, కలగల వెంకటకృష్ణ, డాక్టర్ కె.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.